

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కొత్తూరు మండల పరిషత్ పాఠశాలకు పారిశ్రామికవేత్త చింత నాగ సత్యనారాయణ మూర్తి కంప్యూటర్, ప్రింటర్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, పాఠశాల అవసరాలకు వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఇఒ బి.అప్పాజీ ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు కంప్యూటర్ విద్య ఆవశ్యకతను వివరించారు. దాతను, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ కె.నాగరాజేశ్వరి, హెచ్ఎం వైవివి.రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న హెచ్ఎం రమణ

ముందుకు సాగని రైల్వేలైన్ పనులు

- 25 ఏళ్ల క్రితం పడిన పునాదిరాయి
- మొండి గోడలకే పరిమితమైన పిల్లర్లు
- బడ్జెట్‌లో నిధులు కేటాయింపులతో సరి


పిల్లర్ల దశలోనే నలిచిపోయిన రైల్వేలైన్ పనులు

ప్రజాశక్తి - రాజోలు

కోనసీమ ప్రజల చిరకాల స్వప్నమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో అతీగతి లేదు. గత వైసిపి పాలనలో గ్రహణం పట్టి రైల్వేలైన్ నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. కూటమి పాలనలోనైనా ముందుకు సాగుతుందని కోనసీమ ప్రజలు ఆశించారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తియినా ఆ దిశగా అడుగులు పడటం లేదు.

25 ఏళ్ల క్రితం శంకుస్థాపన..!

రెండో ప్రపంచ యుద్ధం అనంతరం తొలగించబడ్డ కాకినాడ-కోటిపల్లి రైల్వేలైన్‌తోపాటు కోటిపల్లి నుంచి నర్సాపురం వరకు రైల్వేలైన్ నిర్మాణం కోసం అప్పట్లో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వేలైన్ నిర్మాణం పూర్తయి కొంతకాలం పాటు ట్రైన్ నడిపారు. ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో దాన్ని రైల్‌బస్‌గా మార్చారు. ప్రస్తుతం ఇదీ మరుగున పడిపోయింది. ఇక కోటిపల్లి-నర్సాపురం రైల్వే నిర్మాణం కోసం 2000 నవంబరు 16న అప్పటి కేంద్ర రైల్వే మంత్రి మమతా బెనర్జీ, అప్పటి లోక్‌సభ స్పీకర్ జిఎంసి.బాలయోగి సమక్షంలో శంకుస్థాపన జరిగింది. మొత్తం 102.500 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వేలైన్ కాకినాడ-కోటిపల్లి వరకు 45.30 కిలోమీటర్ల మేర ట్రాక్ పనులను పూర్తి చేసుకుంది. కోటిపల్లి నుంచి నర్సాపురం వరకు 57.207 కిలోమీటర్ల మేర కొత్తగా రైల్వేట్రాక్ నిర్మాణంతోపాటు గౌతమీ, వశిష్ఠ, వైనతేయ నదులపై వారధులు నిర్మించడానికి ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయి. అప్పట్లో రూ.2 వేల కోట్ల పైబడిన నిర్మాణ వ్యయం నేడు రూ.3 వేల కోట్లకు పెరిగింది. వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయలపై అప్పట్లో బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో పిల్లర్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. రెండు మూడు ప్రాంతాల్లో సాంకేతిక సమస్యల కారణంగా పిల్లర్స్ నిర్మాణంలో జాప్యం కొనసాగుతోంది.

ఫిల్లర్లు సరే... గడ్డర్లు ఎప్పుడు..?

మూడు నదీపాయలపై నిర్మించిన పిల్లర్లపై గడ్డర్లు నిర్మిస్తే రైల్వేట్రాక్ నిర్మాణానికి మార్గం సుగమం అవుతుంది. వారధులకు పిల్లర్లు నియమించినా గడ్డర్లు నిర్మించి ట్రాక్ ఏర్పాటు చేస్తే మిగిలిన ట్రాక్ నిర్మాణ పనులు, ఇతర కల్వర్టర్లు, నిర్మాణాలు వంటివి చేపట్టే అవకాశం ఉంది.గడ్డర్లు వేయకపోవడంతో నదిలో నిర్మించిన 41 పిల్లర్లు మొండి గోడల్లా దర్శనమిస్తున్నాయి.

భూసేకరణ ఐదు నెలల్లో పూర్తి

రెండో విడత భూసేకరణ పనుల్లో భాగంగా 34.90 కిమీల రైల్వే లైన్ నిర్మాణం కోసం అమలాపురం మండలం భట్నవిల్లి గ్రామం నుంచి మలికిపురం మండలం గుడిమెల్లంక వరకు 18 గ్రామాల పరిధిలో 590.348 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇప్పటికే అధికారులు రాజోలు, మామిడికుదురు, మలికిపురం మండలాల్లోని 13 గ్రామాల్లో సర్వే చేసి 402.637 ఎకరాలు గుర్తించారు. భూమి సేకరణ కోసం తొలుత ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసి, ఐదు నెలల్లో భూసేకరణ పూర్తిచేస్తామని ఇటీవల కలెక్టర్ ప్రకటించారు. మిగిలిన 188 ఎకరాల భూసేకరణపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఇందు కోసం 5 గ్రామాల్లో సంయుక్త సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులకు లేఖ రాసినట్లు రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ తెలిపారు. మూడు బ్రిడ్జీల నిర్మాణం కోసం ఇప్పటికే అమలాపురం మండలం పేరూరు, మామిడికుదురులోని పాశర్లపూడి, మలికిపురంలోని గుడిమెల్లంక వద్ద 24 ఎకరాల భూమిని రైల్వేకు అప్పగించగా పనులు ప్రారంభించారు.

కోటిపల్లి - నరసాపురం ప్రాజెక్టు వివరాలు

కోటిపల్లి నుంచి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వరకు 57.81 కి.మీ. మేర రైలు మార్గం నిర్మించాలన్నది లక్ష్యం. మొత్తం 8 మండలాలు, 25 గ్రామాల పరిధిలో ఏర్పాటుకానున్న రైల్వే ప్రాజెక్టుకు 846 ఎకరాలు అవసరం. తొలి విడతలో రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం మండలాల్లోని ఎనిమిది గ్రామాల్లో 13.45 కి.మీ. మేర రైల్వేలైను ఏర్పాటుకు 255.835 ఎకరాలు గుర్తించారు. 2003లోనే వీటిని సేకరించినా రైల్వేశాఖ ఇంకా స్వాధీనం చేసుకోలేదు. తమకు అదనపు పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టు కోసం రైల్వేకు 279 ఎకరాలు అప్పగించినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

రైల్వే ప్రాజెక్టు పూర్తి చేస్తా



మరో మూడేళ్లలో ఈ రైల్వే ప్రాజెక్టును పూర్తి చేసి కోనసీమ ప్రజలకు అంకితం చేయాలన్నదే నా లక్ష్యం. మా నాన్న బాలయోగి చిరకాల కోరికగా మిగిలిన ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేస్తున్నాను. ఇప్పటికే కేంద్ర రైల్వేమంత్రిని పలు పర్యాయాలు కలిసి రైల్వేలైన్ నిర్మాణ ఆవశ్యకతను వివరించాను. రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించారు.

- గంటి హరీష్‌మాధుర్, ఎంపి

కోనసీమ అభివృద్ధికి దోహదం



రైల్వేలైన్ కోనసీమ అభివృద్ధికి దోహదం చేస్తుంది. కొత్తగా ఏర్పడిన జిల్లా కావడం, సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ఈ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉంది. రైల్వేలైన్ పూర్తియితే పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందడానికి అవకాశ ఉంది. ఎపిలోని ఓడ రేవులను ఈ రైల్వే మార్గం ద్వారా అనుసంధానం చేయవచ్చు. రానున్న రోజుల్లో కోనసీమ ప్రజలు రైలు కూతను వింటారు.

- దేవ వరప్రసాద్, ఎంఎల్ఎ


రామచంద్రపురంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం, కపిలేశ్వరపురం

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.దుర్గమ్మ మాట్లాడారు. ఫేస్ యాప్ పేరుతో లబ్ధిదారులను చాలా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. లబ్ధిదారులకు ఫేస్ యాప్‌ను ఉపయోగించి సరుకులు ఇవ్వాలనే నిబంధన దారుణమన్నారు. ఫేస్ యాప్ పడకపోతే సరుకులు ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దీనివల్ల అనేకమంది లబ్ధిదారులు రోజులు తరబడి అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ రోజు పనికి వెళ్లకపోతే కుటుంబ పోషణ కష్టతరంగా ఉంటుందని, బాలింతలు, గర్భవతులు రావాలన్నా చాలా కష్టదాయంగా ఉంటుందన్నారు. పదేపదే ఫోటోలని, ఇకెవైసి చేయాలని పిలుస్తున్నారని, వెళ్ళిన తర్వాత సిగ్నల్స్ సమస్యతో గంటల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షించాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగా సంతకాలు పెట్టించుకుని సరుకులు ఇవ్వాలని, ఫేస్ యాప్‌ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరత్నం, విజయ లక్ష్మి, సూర్యకుమారి, జహారా, దుర్గ, చంద్రకళ, లక్ష్మీ రత్నం, దాసరి మౌనిక, లబ్ధిదారులు పాల్గొన్నారు. అలాగే కపిలేశ్వరపురం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగాఫేస్ యాప్ రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

కోటిపల్లి - నరసాపురం రైల్వేలైన్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రైల్వే అధికారులు, జెసి టి.నిశాంతి, ఆర్‌డిఒలు కె.మాధవి, పి.శ్రీకర్, ఇతర రెవెన్యూ అధికారులతో భూసేకరణ పెండింగ్ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ పెండింగ్ అంశాలపై దృష్టి సారించాలని, పరిష్కారం దిశగా గడువులను విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కోర్టు వెలువరించిన తీర్పు ప్రకారం పాత, కొత్త అలైన్‌మెంట్ ప్రకారం రెవెన్యూ, రైల్వే అధికారులు జాయింట్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. భట్నవిల్లి నుంచి గుడిమెళ్లంక వరకు జాయింట్ సర్వేను త్వరితగతిన నిర్వ హించి నివేదికను అందించాలన్నారు. భూసేకరణకు మ్యాపులు, విలేజ్ స్కెచ్‌లను పరిశీలించి కేసుల ఉపసంహరణ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్ విలువల ప్రకారం భూముల నష్టపరిహారానికి బడ్జెట్ రిక్వైయిర్‌మెంట్‌కు అంచనాల రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే జూనియర్ ఇంజనీర్ పి.రాహుల్, భూసేకరణ సెక్షన్ సూపరింటెండెంట్ ఏసుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్


అయినవిల్లిలో మాట్లాడుతున్న ఎస్ఐ శాస్త్రి

మాదకద్రవ్యాలపై అవగాహనా కార్యక్రమాలు

ప్రజాశక్తి - అయినవిల్లి, రామచంద్రపురం

అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్' కార్యక్రమం జరిగింది. హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరికోట శాస్త్రి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్, సిగరెట్, గుట్కా, పాన్‌పరాగ్ లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా వాటిని వాడినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాటి సమాచారం తెలిస్తే పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే రామచంద్రపురం పట్టణంలో యువత మాదక ద్రవ్యాల ప్రభావానికి గురికావద్దు అంటూ పోలీసులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్డు నుంచి రాజ గోపాల్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సిఐ వెంకటనారాయణ మాట్లా డుతూ యువకులు మత్తు పదార్థాల వైపు మొగ్గుచూపి జీవితాలు నాశనం చేసుకుంటు న్నారని, వాటికి దూరంగా ఉండాలని అన్నారు. గంజాయి వంటి వాటిని విక్రయించినా, సేవించిన చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ అర్జీకి శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి - అమలాపురం

పిజిఆర్ఎస్‌లో వస్తున్న ప్రతీ అర్జీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆయన పలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే అంశంపై దరఖాస్తులు పునరావృతం కాకుండా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. గడువు దాటిన అర్జీలు లేకుండా అప్రమత్తంగా ఉంటూ నిర్దేశిత కాలవ్యవధిలో నూటికి నూరు శాతం నాణ్యతతో పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. ప్రభుత్వం ఐవిఆర్ఎస్ ద్వారా అర్జీదారుల సంతృప్తి స్థాయిలను ఎప్పటికప్పుడు సేకరిస్తుందని కావున ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోను పునరావృతం కాకూడదని, సమస్య పరిష్కారంతో అర్జీదారులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా అధికారులు పని చేసి ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాన్ని నేరవేర్చాలన్నారు. అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదన్నారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో వచ్చే అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని, ప్రతి సమస్యను శ్రద్ధగా విని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి జిల్లా స్థాయి అధికారి ముగ్గురు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఆర్థిక అవసరాలను లేదా నైపుణ్యాలను కెరీర్ గైడెన్స్‌ను పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ మండల స్థాయి అధికారులు కనీసం రెండు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. ప్రతి జిల్లా స్థాయి అధికారి ఒక వసతి గృహం, గురుకుల పాఠశాలను దత్తత తీసుకొని నెలలో రెండు పర్యాయాలు సందర్శిస్తూ తమతో పాటు నియమించిన డిఇ స్థాయి ఇంజనీర్ సహకారంతో చిన్న తరహా మరమ్మతు పనులను చేపట్టాలని, పెద్ద తరహా మరమ్మతు పనులు చేయాల్సినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంకీర్ణ సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితా రూపొందించడంలో సహ అర్హులైన యువ ఓటర్ల నమోదు దిశగా ప్రోత్సహించాలన్నారు. దోష రహిత, తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడంలో రాజకీయ పక్షాలు, అధికారులు సమన్వయంతో అర్హులైన యువ ఓటర్లను నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలో మరణించినా, శాశ్వతంగా వలస వెళ్లినా వారి పేర్లను బూతు స్థాయి అధికారికి తెలియ జేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, ఓటరు కార్డులో ఏవైనా తప్పులు ఉంటే నమోదు చేసి సరిచేసేందుకు సహకరించాలన్నారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, డిఆర్ఒ రాజకుమారి, ఎస్‌డిసి కృష్ణమూర్తి, డ్వామా పీడీ మధుసూదన్, సమగ్ర శిక్ష ఎపిసి జి.మమ్మీ, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలో అధికారుల తీరుపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి కుండా అన్నపూర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వెలిచేరు సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల నిర్మాణ పనులు పూర్తయిన ఎందుకు ప్రారంభించడం లేదని అధికారులను నిలదీశారు. గ్రామాలలో జలజీవన్ మిషన్ పనులు పూర్తయిన నేటికీ తాగునీటిని అందించడం లేదంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ శ్రీధర్‌పై మండిపడ్డారు. జడ్‌పిటిసి బోనం సాయిబాబా మాట్లాడుతూ నేటికీ ధాన్యం బకాయిలు రైతు ఖాతాలలో జమ కాలేదని, రైతులు అప్పులు చేసి ఖరీఫ్ సాగుకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని అన్నారు. నార్కెడిమిల్లి సర్పంచ్ పాల నాగేశ్వరరావు మాట్లాడుతూ రిజిస్టర్ కార్యాలయం నుంచి గ్రామపంచాయతీలకు రావలసిన స్టాంప్ డ్యూటీపై గత నాలుగు సమావేశాల్లో అడిగిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం దారుణమని పలువురు ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేస్తే సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి పెనుమచ్చ బంగారురాజు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అన్నపూర్ణ

ఉపాధ్యాయునికి జాతీయ అవార్డు



ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మండలంలోని పాలగుమ్మి జడ్‌పి ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు నరసింహ చంద్రకుమార్ 'గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు'ను అందుకున్నారని క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ అధినేత అంజి ఆకొండి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల తమ సంస్థ ఆధ్వర్యంలో 'సింధూర్ - సెల్యూట్ ఇండియన్ సోల్జర్స్' అనే అంశంపై జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రకళా పోటీలలో 15 రాష్ట్రాలకు చెందిన 250 మంది చిత్రకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీల్లో పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్, కల్నల్ సోఫియా ఖురేషి చిత్రాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి వేశారని తెలిపారు. జాతీయ స్థాయి చిత్రకళా పోటీలలో అవార్డు వచ్చినందుకు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్‌ను పలువురు అభినందించారు.

మిథున్ రెడ్డి అరెస్టును ఖండిస్తూ నిరసన


ప్రజాశక్తి - అమలాపురం రూరల్, రామచంద్రపురం

ఎంపి మిథున్ రెడ్డి అరెస్టును ఖండిస్తూ సోమవారం రూరల్ మండలం జనుపల్లి గ్రామంలో వైసిపి విద్యార్థి విభాగం ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ రమేష్ జిల్లెళ్ళ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్ళపై నిరసన వ్యక్తం చేశారు. ఎటువంటి ఆధారాలు లేని కేసులో మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం దారుణమని రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు పెయ్యాల సాయి, బడుగు మోహన్, వరసల సుజిత్, విన్సీ, సాగర్, ఆనంద్, రవికుమార్, సల్మాన్ రాజ్ పాల్గొన్నారు. ఎంపి మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులో ఇరికించి అరెస్టు చేయడాన్ని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎక్సైజ్ శాఖకు సంబంధం లేని వ్యక్తిపై తప్పుడు ఆరోపణలు, బలవంతపు ఒప్పందాలు, అధికార దుర్వినియోగం ద్వారా కేసులు పెట్టడం దారుణమన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి శ్రేణులు

కార్టూ'నిజం'



కందికుప్పలో ప్రబలిన విషజ్వరాలు

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని కందికుప్ప జమ్మిచెరువు కాలనీలో విషజ్వరాలు ప్రభలడంతో స్థానికులు ఆందోళను వ్యక్తం చేస్తున్నారు. కాళ్లూ, చేతులూ, శరీర కండరాలు నొప్పి పెడతుండడంతో డెంగీ, మలేరియా జ్వరాలుగా భావించి స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. గత వారం రోజులుగా జ్వరాలతో బాధపడుతున్న గ్రామ ప్రజలు, అమలాపురం ఏరియా ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో కాకినాడ జిజిహెచ్‌కు రిఫర్ చేయడంతో స్థానిక ప్రయివేటు ఆసుపత్రి జనతా క్లినిక్ హాస్పిటల్‌లో పదిమంది బాధితులు చికిత్స పొందుతున్నారు. వర్షాకాలం కావడంతో కాలనీలో ఎటుచూసినా మురుగునీరు నిలువ ఉండిపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారి విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. అయితే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మాత్రం ఇవి మామూలు జ్వరాలేనంటూ కొట్టిపడేస్తున్నారు. ముందు జాగ్రత్తగా గ్రామంలో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి స్థానికులకు మందులను అందచేస్తున్నారు. దోమలతో పాటుగా ఇక్కడ డయేరియా, పచ్చకామెర్లు లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దీనికి కారణం పంచాయితీ ద్వారా సరఫరా అవుతున్నకలుషిత నీరే కారణమని గ్రామస్తుల ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో తాగునీరు సరఫరా సరిగా లేదని, ఫిల్టర్ చేయకుండా నీటిని సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. గత నాలుగు రోజులుగా కుళాయిల ద్వారా మట్టి నీళ్లు వచ్చాయని, కలుషిత నీరు తాము అనారోగ్యం భారిన పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.


బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

జ్వర పీడుతులకు సిపిఎం పరామర్శ

కందికుప్ప జ్వర పీడుతులను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి. దుర్గాప్రసాద్ పరామర్శించారు. స్థానియ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన డిఎంహెచ్ఒ, మలేరియా డాక్టర్, స్థానిక పిహెచ్‌సి డాక్టర్ నీలిమతో మాట్లాడారు. గ్రామస్తులందరికీ డెంగీ, మలేరియా టెస్టులు చేస్తున్నట్లు వారు వివరించారు. ఒకే గ్రామంలో ఇంత మంది జ్వరాల భారిన పడటానికి గల కారణాలను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సఖిలే సూర్యనారాయణ, కె. లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.


గ్రామంలో నిలిచిపోయిన వర్షపు నీరు


మొక్కను నాటుతున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - మండపేట

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కోన సత్యనారాయణ, ప్రముఖ ఫిజియోథెరఫిస్టు వైద్యులు డాక్టర్ సయ్యద్ హైదర్ ఆలీ అన్నారు. సోమవారం డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ బురుగుంటచెరువు పార్క్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పెళ్లి రోజులు, పుట్టిన రోజులు వంటి సందర్భాల్లో ఒక మొక్క నాటాలని కోరారు. పచ్చని చెట్లను నరికి వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఉపాధ్యక్షులు రెడ్డి రాజు, సిహెచ్.భాస్కరరాజు, గంపల సత్యప్రసాద్, సిహెచ్.బాస్రరరాజు, లంక సత్యనారాయణ, మంగరాజు, రాజు, వాకర్స్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ మెడలో మంగళ సూత్రాల చోరీ

ప్రజాశక్తి - మామిడికుదురు

అపరిచిత వ్యక్తి మంచినీళ్ల కోసం వచ్చి మహిళ మెడలో బంగారు మంగళ సూత్రాల బొందు అపహరించిన సంఘటన పాశర్లపూడి బాడవలో ఆదివారం రాత్రి జరిగింది. బైక్‌పై వచ్చిన అపరిచిత వ్యక్తి వలవల వరలక్ష్మిని మంచినీళ్లు అడిగి, తరువాత సెల్ ఫోన్ ఇవ్వండని అడగడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఆమె గొంతు పట్టుకుని బెదిరించి రెండున్నర కాసుల మంగళ సూత్రాల బొందు తెంచుకొని బైక్‌పై పారిపోయినట్లు నగరం ఎస్ఐ చైతన్యకుమార్ సోమవారం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

యువకుని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గోదావరిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు గోదావరిలో గల్లంతయిన యువకుడు మృతదేహం ఎట్టకేలకు లభించింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..ఖమ్మం జిల్లా వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పామర్తి సాయితేజ(22) సత్తుపల్లి సెక్ట్ మదర్ థెరిసా కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. శనివారం తన స్నేహితులతో వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చి గౌతమి గోదావరి నదిలో స్నానం చేస్తుండగా మునిగి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డిఆర్ఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే సోమవారం అయినవిల్లి మండలం చానపల్లి లంక సమీపంలోని గౌతమి గోదావరి నదిలో సాయి దినేష్ మృతదేహం లభించింది. మృతదేహాన్ని పడవపై ఒడ్డుకు చేర్చి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన కొవ్వల దుర్గాభవాని(16) అదృశ్యమైందని తల్లి కొవ్వల ధనలక్ష్మి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. దుర్గాభవాని చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటుంది. ఈ నెల 17వ తేదీ రాత్రి నుంచి కనిపించట్లేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.



ఎంఎల్ఎ, ఎంఎల్‌సిలు ఆవిష్కరించిన శిలాఫలకాలు

అతీగతి లేని రహదారి నిర్మాణం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని టేకి నుంచి నల్లూరు వెళ్లే ఆర్ అండ్ బి రహదారి నిర్మాణం కోసం పాలకులు శిలాఫలకాలను ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఆ రహదారి నిర్మాణానికి అతీగతీ లేకుండా పోయింది. 2019 జనవరి 22న నాటి టిడిపి పాలనలో ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు రూ.140 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. అనంతరం వైసిపి ప్రభుత్వ హయాంలో అదే రహదారి నిర్మాణం కోసం 2024 మార్చి 10న ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు రూ.83.10 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. అయితే అవి శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. పనులు ప్రారంభానికి నోచు కోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం నాడు ఎంఎల్ఎగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన వేగుళ్ళ జోగేశ్వరరావు మరోసారి ఎంఎల్ఎగా ఉన్నారు. ఇప్పటికైనా ఆ రహదారి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉల్లాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాస అవగాహన కోసం కేంద్ర ప్రాయోజిత అక్షరాస్యత ఉల్లాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. సోమవారం ఆమె పిజిఆర్ఎస్ కార్యక్రమంలో మాట్లాడారు. 15 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న నిరక్షరాస్యులను లక్ష్యంగా ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, ముఖ్యమైన జీవిత నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాల అభివృద్ధి, ప్రాథమిక విద్య వంటి కనీస సామర్థ్యాలను పెంపొందిస్తారన్నారు. పదిమంది నిరక్షరాస్యులకు ఒకరు చొప్పున వాలంటీర్లను నియమించి, అనుభవ ఆధారిత విద్యాభ్యాస కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. ఉల్లాస్ పథకం సమాజంలోని ప్రతి ఒక్కరికి అర్హులైన వారికి కనీస విద్య నేర్చుకునే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఇంటర్ డ్రాప్ ఔట్ విద్యార్థులను జాయిన్ చేసి పరీక్షలు రాసి ఉత్తీర్ణులు అయ్యేలా చర్యలు తీసుకుంటారన్నారు. నిరక్షరాస్యులకు రోజూ రెండు గంటల చొప్పున మొత్తం 200 గంటల బోధన అందిస్తారన్నారు. క్లాసుల నిర్వహణకు పాఠశాలలు, ప్రభుత్వ కమ్యూ నిటీ భవనాలు, అంగన్‌వాడీ సెంటర్ల వంటి ప్రాంతాలను గుర్తించి, డిజిటల్ కంటెంట్తో బోధించేందుకు కంప్యూటర్, టివిలను సమకూరుస్తారన్నారు. ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలనే పవిత్రమైన ఆశయంతో చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె అధికారులను కోరారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన

ప్రజాశక్తి - పెద్దాపురం


కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పరిపాలనపై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం కాండ్రకోటలోని పద్మశ్రీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాల ద్వారా సహాయ సహకారాలు అందించామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను కూడా అమలు చేయలేదన్నారు. వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన త్రీమెన్ కమిటీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు పిఎసిఎస్‌ల త్రీమెన్ కమిటీలు సోమవారం ప్రమాణస్వీకారం చేశాయి. ఆయా కార్యక్రమాల్లో పలువురు ఎంఎల్ఎలు పాల్గొని అభినందనలు తెలిపారు.

ఆలమూరు మండలంలోని చింతలూరు, మోదుకూరు, పెనికేరు పిఎసిఎస్‌ల త్రీ మేన్ కమిటీలు సోమవారం బాధ్యతలు స్వీకరించాయి. ఈ కార్యక్రమాల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు. చింతలూరు పిఎసిఎస్ ఛైర్మన్‌గా నల్లా వెంకటేశ్వరరావు, సభ్యులుగా బుంగ చిన్నబ్బులు, కడలి రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పినపళ్ల సర్పంచ్ సంగీత, నీటి సంఘం అధ్యక్షులు వైట్ల గంగరాజు, కూటమి నేతలు పాల్గొన్నారు. అలాగే మోదుకూరు పిఎసిఎస్ ఛైర్మన్‌గా ఈదల వీర్రాజు చౌదరితో పాటు సభ్యులుగా కొత్తగళ్ల గోపికృష్ణ, తాతపూడి చిన్నజనకయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చుండ్రు శ్రీనివాస్, వంక అన్నవరం, వంక రాజు, కోరా వీరభద్రరావు పాల్గొన్నారు. అలాగే పెనికేరు పిఎసిఎస్ అధ్యక్షునిగా మేకా రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు ఈదర చిన్నబాబు, నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు, ఆలమూరు సొసైటీ అధ్యక్షులు వంటిపల్లి సతీష్, నాయకులు సలాది నాగేశ్వరరావు, ఈదల నల్లబాబు, వైట్ల శేషుబాబు పాల్గొన్నారు. ఛైర్మన్ రాంబాబు మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. **అమలాపురం** కా వెంకట్రావు పిఎసిఎస్ ఛైర్మన్‌గా అల్లాడ శరత్‌బాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొని శరత్‌బాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, పట్టణ టిడిపి అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబురాజు, ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలమూరి ధర్మపాల్, దేవగుప్తం సొసైటీ అధ్యక్షులు వేగిరాజు వెంకటరాజు, మాజీ జడ్‌పిటిసీలు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, పాల్గొన్నారు. **అమలాపురం రూరల్** రోళ్లపాలెం సొసైటీ అధ్యక్షుడుగా మట్ట మహాలక్ష్మి ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయితాబత్తుల ఆనందరావు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** మండలంలోని వాకతిప్ప పిఎసిఎస్ ఛైర్మన్‌గా గోదవర్తి సత్యనారాయణ మూర్తి, మెంబర్లుగా వాసంశెట్టి నాగేశ్వరరావు, దాకారపు నాగేశ్వరరావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ కరుటూరి నారాయణరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, డిసిసిబి మండల అధ్యక్షులు బలవరెడ్డి సత్తిబాబు, మాజీ అధ్యక్షులు ముత్యాల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మండలంలోని గోపవరం పిఎసిఎస్ అధ్యక్షునిగా పోస్తా రాంబాబు, డైరెక్టర్లుగా ఆకుల అప్పారావు, దొమ్మేటి సాయిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు పాల్గొన్నారు. నూతన త్రీ మేన్ కమిటీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూనవరం సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి, మాజీ ఎంపి ఎజెవి.బుచ్చిమహేశ్వరరావు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆరిగెల నానాజీ, తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన** మండల పరిధిలోని చెయ్యేరు, కందికుప్ప పిఎసిఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. చెయ్యేరు సొసైటీ అధ్యక్షులుగా తృవటపల్లి శ్రీనివాస్, సభ్యులు గుబ్బల రమేష్‌బాబు, పేయ్యల ముత్యాలరావు, కందికుప్ప సొసైటీ అధ్యక్షులుగా నూకల మూర్తి, సభ్యులుగా కాలాడి వీర్రాజు, బొంతు శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, సర్పంచ్ చెల్లి సురేష్, ఎఎంసి ఛైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, మండల పార్టీ అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు. **మండపేట** రాయవరం మండలం పసలపూడి పిఎసిఎస్ ఛైర్మన్‌గా సత్తి వెంకటబ్బిరెడ్డి, సభ్యులుగా అనుసూరి శ్రీనివాస్, బుంగ పెద్ద ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొని నూతన కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లిడి సూరిరెడ్డి, మాజీ జడ్‌పిటిసి కెవి.కృష్ణారెడ్డి, రామచంద్రపురం సొసైటీ కమిటీ అధ్యక్షులు నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** మండలంలోని అయినాపురం సొసైటీ అధ్యక్షునిగా ఇందుకూరి పాండురంగారావు, సభ్యులుగా మెండి ఏడుకొండలు, మట్ట తులసీరావు ప్రమాణ స్వీకారం చేశారు. సిఇఒ రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొని వారిని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెల్లి అశోక్, గుత్తుల సాయి, దంగేటి శ్రీనివాస్, సడిపల్లి శివ రాజు, గోదాశి పుండరీక్, డిసిసి బ్యాంక్ మేనేజర్ వై.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



చింతలూరులో మాట్లాడుతున్న జనసేన నేత శ్రీనివాస్



మోదుకూరు ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వీర్రాజు




అయినాపురం సొసైటీ అధ్యక్షుడు ఇందుకూరి




కాట్రేనికోన మండలంలో...



పెనికేరు ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాంబాబు



మహాలక్ష్మి ప్రభాకర్‌ను అభినందిస్తున్న తుమ్మల బాబు



శరత్ బాబును అభినందిస్తున్న వేణుగోపాలరావు



పసలపూడి ఛైర్మన్ ఎస్‌విని సత్కరిస్తున్న అభిమానులు



గోపవరం సొసైటీ అధ్యక్షుడు రాంబాబు

ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఉద్యోగస్తులకు ఇవ్వాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దాల బాపూజీ డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ ఉద్యోగ సంఘ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మల్లిబాబు మాట్లాడుతూ ఈనెల 25, 26 తేదీలలో విజయవాడలో జరిగే ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాట కార్యక్రమాన్ని నిర్ణయిస్తారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు, సర్వీస్ రూల్స్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాపూజీ

అనంతరం రామచంద్రపురం తాలూకా కమిటీ ఎన్నికలు ఘనంగా జరిగాయి. నూతన కమిటీని సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలూకా అధ్యక్షులుగా కొమ్మల సోమనాయుడు, రెవెన్యూ శాఖ తాలూకా సెక్రటరీగా ఎం.శ్రీమన్నారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ గా ఎంఎస్.సుబ్బలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కరుణ, కోశాధికారిగా సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి - యంత్రాంగం

మండపేట పట్టణంలోని 22వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొని ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. **రామచంద్రపురం** మండలంలోని కాపవరంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు.ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. గ్రామంలో నెలకున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెరుగైన పరిపాలన వైపు ముందడుగు వేస్తోందని అన్నారు. ప్రతి కుటుంబానికి విద్య, వైద్యం, ఉపాధి పూర్తి స్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కాట్రేనికోన** మండలంలోని చెయ్యేరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో మంత్రి పర్యటన

ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, స్థానిక సర్పంచ్ సురేష్, మండల పార్టీ అధ్యక్షులు నడుంపల్లి సుబ్బరాజు, రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, చెల్లి అశోక్, గుత్తుల సాయి, తృవటపల్లి నాగు పాల్గొన్నారు. **రాజోలు** మండలంలోని శివకోడు గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెదాపురం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు బోళ్ళ వెంకటరమణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోళ్ళ సతీష్‌బాబు, సిహెచ్. శ్రీనివాస్, ఆరుమిల్లి భాను పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

ప్రజాశక్తి - రావులపాలెం

ఆటోలో ప్రయాణం చేసి నగదు, విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌ను వదిలివెళ్లిపోయిన ఆమెకు ఆటో డ్రైవర్ తిరిగి అప్పగించి తన నిజాయితీని నిరూపించుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే...ఊబలంక నుంచి రావులపాలెం వెళుతున్న గుడిమెట్ల మధులత ఆటోలో వెళ్తూ తన బ్యాగును ఆటోలో వదిలి వెళ్లిపోయారు. అయితే ఆటో డ్రైవర్ మహమ్మద్ వల్లి ఆ బ్యాగును గుర్తించి పోలీస్‌స్టేషన్లో పోలీసులకు అప్పగించాడు. ఆటోలో బ్యాగును మరిపోయిన మహిళ స్టేషన్ రాగా ఆమెకు బ్యాగులో ఉన్న రూ.10వేలు నగదు, ఇతర విలువైన వస్తువులతో సహా ఆమెకు పోలీసులు అప్పగించారు. ఈసందర్భంగా పోలీసులు డ్రైవర్‌ను అభినందించారు.

రూ.1.5 కోట్ల విలువైన భూమి స్వాధీనం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన రూ.1.5 కోట్లు విలువైన 0.45 సెంట్లు స్థలాన్ని సోమవారం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బాలాజీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రస్టు ఇఒ సత్యనారాయణ, ఆలయాల సిబ్బంది స్థలం స్వాధీనం చేసుకున్నారు. దేవదాయ శాఖ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఆక్రమణలో ఉన్న స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా దేవదాయ శాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒలు జొన్నాడ.భీమశంకరం, వైవివి.సత్యనారాయణ, వి.బాలకృష్ణ, విత్తనాల.శ్రీనివాస్, ఆలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పూడిక తీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని 12వ వార్డులో అనాతవరం - బొండాయి కోడుతూము పంటలో పేరుకుపోయిన పూడిక తీత పనులను సోమవారం నీటి సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీటి ఎద్దడి రాకుండా యుద్ధ ప్రాతిపదికన పూడిక తీత పనులకు నాంది పలికామన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరపు దుర్గాబాబు, సరిపల్లి రాముర్రాజు, నీటి సంఘం డైరెక్టర్స్ యల్లమెల్లి ఇటోబారావు, లంక బాలయోగి, చిన్నిరాజు, లష్కర్ వీళ్లా శ్రీను పాల్గొన్నారు.

ఇష్టంతో విద్యను అభ్యసించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

కష్టపడి ఇష్టంతో విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థితికి చేరుకుంటారని రాజోలుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కొమ్ముల అచ్చుత రామదాసు అన్నారు. సోమవారం స్థానిక హైస్కూల్‌లో దాత ఎరుబండి సత్యవర్ధన్‌రావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. హెచ్ఎం బి.చిరంజీవిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు నూకాంబిక ఆలయ అభివృద్ధికి ఆలమూరుకు చెందిన మహాలక్ష్మి రైస్ మిల్ యాజమాన్యం వెత్సా సత్తిబాబు, వెత్సా శంకరం, వెత్సా నానాజీ, వెత్సా రవి రూ.25,116 విరాళాన్ని అందించారు. ఆలయంలో జరుగుతున్న రాజగోపురాల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల నిమిత్తం ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గన్ని వెంకట్రావు, గన్ని సూరిబాబు, వైట్ల గంగరాజు, వైట్ల శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అరెస్టులు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే వైసిపి నేతలను అరెస్టులు చేస్తున్నదని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నదని అన్నారు. ఈ తరహా అరెస్టులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రతిపక్ష వైసిపి నాయకులను అక్రమ అరెస్టులు చేసి పబ్బంగడుపుకుంటుందని అనప్పారు. దీనికి తగినమూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం, అయినవిల్లి

ఉప్పలగుప్తం మండలం గొల్ల విల్లిలో వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గత ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీలు, చేస్తున్న మోసాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా అమలాపురం నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ వివరించారు. గ్రామస్థాయిలో కార్యకర్తలు, నాయకులు శక్తి వంచన లేకుండా పని చేసి రాబోయే ఎన్నికల్లో వైసిపిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు పేరి శ్రీనివాస్, జడ్‌పిటిసి గెద్దం సంపదరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు. అయినవిల్లి మండలంలోని పొట్టిలంక గ్రామంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు మేడిశెట్టి శ్రీనివాష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ కో.ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరిదేవి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - రావులపాలెం

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం మండలంలోని దేవరపల్లి, దేవరపల్లి శివారు బాలయోగి పేట, దంగేటి వారి పాలెంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో నూతంగా నిర్మించిన పలు రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి ప్రసాద్, గుత్తుల పట్టాభిరామారావు, కేతా శ్రీను, కాసా సాగర్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన దేవస్థానం పాలకవర్గం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని కేశవ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. సోమవారం దేవస్థానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఆలయ ఇఒ ఎం.రాంబాబురెడ్డి నూతన పాలకవర్గం ఛైర్మన్‌గా గొడవర్తి వెంకటలక్ష్మి, మెంబర్లుగా వి.సాయిఅరుణ, జి.ఆదిలక్ష్మి, కె.కృష్ణవేణి, టి.రవిభాస్కర్, ఎన్.శ్రీనివాస్, జి.రామలక్ష్మి, పి.శ్రీనివాస్, సిహెచ్.భాగ్యలక్ష్మిలతో ప్రమాణస్వీకారం చేయించారు.

'భీమకవి' పుస్తక ఆవిష్కరణ సభ

ప్రజాశక్తి - అమలాపురం

భీమకవి చోడగిరి చంద్రరావు పుస్తక ఆవిష్కరణ సభ స్థానిక బుద్ధ విహార్‌లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను సాహిత్యం ద్వారా చంద్రరావు ప్రచారం చేశారని కొనియాడారు. మార్క్సిస్ట్ సాహిత్యం ఉధృతంగా ఉన్న రోజుల్లో చందర్రావు అంబేద్కర్ ఆశయాలను తన పద్యాల ద్వారా చాటి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక సంపాదకులు డాక్టర్ కోయ కోటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బండి సత్యనారాయణ, పుస్తక ప్రచురణకర్త నేలపూడి బాలరాజు, డిబి.లోక్, ఎంఎకె.భీమారావు, నాగాబత్తుల ప్రసాద్‌రావు, బివివి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మ్యాన్‌ను అభినందించిన నాగిరెడ్డి బ్రదర్స్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చెముడులంక శివారు గాంధీనగరానికి చెందిన లైన్‌మ్యాన్ అడబాల రామకృష్ణను నాగిరెడ్డి బ్రదర్స్ అభినందించారు. విద్యుత్ శాఖలో జరిగిన క్రీడా పోటీల్లో భాగంగా జరిగిన క్రికెట్‌లో అత్యుత్తమ ఆల్ రౌండ్ ప్రదర్శన చేసి వివిధ బహుమతులను గెలుచుకున్న రామకృష్ణ ఆంధ్ర ఎలక్ట్రికల్ క్రికెట్ టీం కెప్టెన్‌గా ఎంపిక అయ్యాడు. గాంధీనగరంలోని రామకృష్ణ నివాసానికి చొప్పెల్ల సొసైటీ ఛైర్మన్ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, కూటమి నాయకులు వెళ్లి ఆయనను ఘనంగా సత్కరించారు.

బాలికల విద్యకు ప్రభుత్వ పోత్సాహం

ప్రజాశక్తి - రామచంద్రపురం

బాలికల విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తుందని డివైఇఒ పిఆర్ఎల్.మూర్తి అన్నారు. సోమవారం ద్రాక్షారామ జడ్‌పి హైస్కూల్ ఇంటర్ ప్లస్ చదువుతున్న 60 మందికి ఇదే పాఠశాలలో పనిచేస్తున్న వి.రత్నపద్మావతి సమకూర్చిన యూనిఫాంను డివైఇఒ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. దానికోసం నిరంతరం శ్రమ పడితేనే అద్భుతమైన విజయాలు సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.శేఖర్, ఎంఇఒ-2 వి.నాగేశ్వరి, పిఇటి ఆని శ్రీనివాస్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి - అల్లవరం

బదిలీపై వెళ్తున్న పలువురు సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ బొమ్ము బాలవేణి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక సచివాలయం 1, 2లలో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ఉద్యోగులు ఎం.లోవరాజుబాబు, జె.అర్జున, డి.సువర్ణ, ఇ.గంగభవాని, కె.సురేష్, వై.రాజకుమారి, బి.యోగనాగేశ్వరి, షేక్ బేగంలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దాసం రత్నశ్రీ, ఎంపిటిసి సభ్యులు నిచ్చెనకోళ్ల మౌనికవరలక్ష్మి, స్థానికులు కంకిపాటి వీరబాబు, మామిడిశెట్టి రాజు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజమోహన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.